క్లుప్తంగా

26న వైద్య శిబిరం

బొబ్బిలి: మండలంలోని గొంగాడవలస గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద ఈ నెల 26వ తేదీన వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామానికి చెందిన గొంగాడ శంకరరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. శిబిరంలో 86 రకాల వైద్య పరీక్షలు చేయడంతో పాటు సుగర్, లిపిడ్ ప్రొఫైల్, లివర్ ఫంక్షనింగ్, కిడ్నీ ఫంక్షనింగ్, థైరాయిడ్ ప్రొఫైల్, యూరిన్ ఎగ్జామినేషన్, బ్లడ్‌కౌంట్, హెచ్‌బీఏ తదితర పరీక్షలను అతి తక్కువ ధరకే నిర్వహించడం జరుగుతుందన్నారు. అవసరమైన వారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9550311249ను సంప్రదించాలని కోరారు.

ఏవీపురం పాఠశాలలో ఇంటర్ తరగతులు



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో ఎరకయ్య, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని ఏవీపురం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహించడం జరుగుతోందని ఎంఈవో బి.ఎరకయ్య తెలిపారు. మండలంలోని ఉనుకూరు, పోరాం, అంబాడ, వెంకటాపురం, పెద్దశిర్లాం గ్రామాలకు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావుతో కలిసి గురువారం వెళ్లిన ఆయన.. ఏవీపురంలో అందుబాటులోకి వచ్చిన ఇంటర్మీడియట్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని ప్రచారం చేశారు. పదో తరగతి పాసైన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి, ఇంటర్మీడియట్ గ్రూపులు, విద్యార్థులకు అందించే నాణ్యమైన విద్య, వసతులను వివరించారు.

కవి మూర్తికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న మూర్తి

బొబ్బిలి: విశాఖపట్నంలోని కంచరపాలెం వద్ద ఉన్న ఓ ప్రైవేట్ కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో మండలంలోని జగన్నాథపురానికి చెందిన కవి, జాతీయ తెలుగు వెలుగు సాహిత్య వేదిక అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎస్.ఎన్ మూర్తికి డాక్టరేట్ ప్రదానం చేశారు. తెలుగు సాహిత్యానికి ఆయన అందిస్తున్న సేవలకు గాను ఈ గౌరవం దక్కింది. ఈ మేరకు ఆయనకు ఆర్చ్ బిషప్ అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు మరియకుమార్, డాక్టర్ ఏసుదాసు, బి.ఎస్.రావు, ఎం.చినగౌరినాయుడు, డాక్టర్ ఎం.నారాయణరావు, డాక్టర్ బి.రమాదేవి తదితరులు అభినందనలు తెలిపారు.

లెప్రసీ వ్యాధిపై అవగాహన



రేగిడి: ఉంగరాడలో లెప్రసీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామంలో లెప్రసీ వ్యాధిపై గురువారం అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, చర్మంపై నెలకొనే రాగిరంగు మచ్చలు, కాళ్లు పూర్తిగా మూసుకోకపోవడం, చెవితమ్మెలు మందంగా తయారవడం వంటివి వ్యాధి లక్షణాలని, ప్రాథమిక దశలోనే ఈ లక్షణాలు గుర్తిస్తే చికిత్స సులభమవుతుందన్నారు. కార్యక్రమంలో రేగిడి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



సామూహిక హారతి పూజల్లో భక్తులు

బొబ్బిలి: నృసింహ, అన్నమయ్యల జయంతి పురస్కరించుకుని, మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెంట గ్రామంలోని అన్నపూర్ణ సహిత నగిరేశ్వరస్వామి ఆలయంలో సమరసత సేవా ఫౌండేషన్ డివిజన్ ధర్మప్రచారక్ ధూపం వాసు ఆధ్వర్యంలో సామూహిక హారతి కార్యక్రమం చేపట్టారు.

ర్యాలీలు, ఊరేగింపులు నిషేధం

గజపతినగరం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ నెల 4వ తేదీన వెలువడతాయని, గెలుపు సంబరాల్లో భాగంగా ఆరోజున ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదని స్థానిక సీఐ ఎన్.వి.ప్రభాకరరావు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గజపతినగరం సర్కిల్ పరిధిలో ఉన్న అయిదు మండలాల్లో ఏ గ్రామంలో కూడా సంబరాలు చేయడం, బాణా సంచా కాల్చడం వంటివి చేయరాదని అన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



రామభద్రపురంలో కొనుగోలుదారుల కోసం ఆశగా ఎదురుచూస్తున్న పండ్ల వ్యాపారులు

చిరువ్యాపారులకు ఎండ దెబ్బ



- వేసవిలో జనసంచారం తగ్గడంతో మందగించిన వ్యాపారం
- ఎండల వేడికి పాడవుతున్న పండ్లు, కూరగాయలు
- షెడ్లు నిర్మించి, తక్కువ అద్దెకు ఇవ్వాలని వ్యాపారుల విజ్ఞప్తి



ఎండల వేడికి పాడైపోతున్న పండ్లు

రామభద్రపురం: రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు కూడా బద్దలవుతాయంటారు పెద్దలు.. ఇది నిజమే ప్రస్తుత వేసవిలో రోళ్లు బద్దలయ్యేలా ఎండలు కాస్తున్నాయి. నిత్యం 40 నుంచి 42 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఈ ఉష్ణోగ్రతల కారణంగా ఉదయం 9 గంటలకే ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టేందుకు జనం భయపడిపోతున్నారు. దీంతో రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది. తీవ్రమైన ఎండల నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలు ఇళ్లకే పరిమితమైపోతుండడంతో వ్యాపారాలు బాగా మందగించాయని వారు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రామభద్రపురం అంతర్‌రాష్ట్ర కూడలిలో పలు గ్రామాలకు చెందిన చిరువ్యాపారులు సీజనల్‌గా దొరికే రకరకాల పండ్లు, కూరగాయలు అమ్ముతుంటారు. ఇప్పుడు ఎండలకు జనసంచారం తగ్గడంతో వ్యాపారం బాగా పడిపోయిందని, అధిక ఉష్ణోగ్రతలకు పండ్లు, కూరగాయలు కూడా పాడైపోతున్నాయని దీంతో తామంతా తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ వ్యాపారం మీద ఆధారపడి బతుకుతున్న తమకు ఎండలు కష్టాలు తెచ్చిపెడుతున్నాయని వాపోతున్నారు. ఇక్కడే షెడ్లు నిర్మించి, తక్కువ అద్దెకు ఇస్తే తమ కష్టాలు తీరుతాయని అంటున్నారు.

గిరాకీ తగ్గింది..



వేసవిలో గిరాకీ తగ్గింది. ఎండల వేడికి ఎవరూ రావడం లేదు. దీంతో పండ్లు, కూరగాయల వ్యాపారం బాగా తగ్గింది. సాధారణంగా ఎండాకాలంలోనే పండ్లకు మంచి గిరాకీ ఉండాలి. కానీ అలా ఇప్పుడు లేదు. రోజుకు రూ.1000 కూడా వ్యాపారం కావడం లేదు. రోజుకు రూ.200 కూడా లాభం లేకపోతే ఎలా.. కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నాం.

–దేవతన సురేష్, కూరగాయల వ్యాపారి, రామభద్రపురం.

నష్టాల బారిన పడుతున్నాం..



నేను గత పదేళ్లుగా కూరగాయల వ్యాపారం చేస్తున్నాను. ఈ సమయంలో ఎప్పుడూ ఇంత ఎక్కువగా ఎండలు లేవు. ఎండల వేడికి కూరగాయలు, పండ్లు పాడైపోతున్నాయి. ఎండల తీవ్రత కారణంగా ఉన్న కొన్నింటిని కూడా కొనుగోలు చేసేందుకు జనాలు రావడం లేదు. దీంతో నష్టాల బారినపడుతున్నాం.

–మరడాన రామారావు, చిరువ్యాపారి, రామభద్రపురం

నేత్ర శస్త్రచికిత్సకు 46 మంది ఎంపిక



వృద్ధుడి కంటిని తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామంలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి హాజరైన 94 మందిలో 46 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు సర్పంచ్ కరణం గోవిందరావు తెలిపారు. విశాఖ శంకర్ ఫౌండేషన్, సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించగా, వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య సిబ్బంది తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారన్నారు. కార్యక్రమంలో రాజాం సత్యసాయి భజన మండలి జోనల్ కన్వీనర్ కరణం రామకృష్ణ, సత్యసాయి యూత్ కో–ఆర్డినేటర్ రాజు, క్యాంప్ ఇన్‌చార్జి సీహెచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

భగవన్నామస్మరణతోనే మోక్షం



ప్రసంగిస్తున్న వక్తలు

రేగిడి: భగవంతుడి నామస్మరణతోనే మోక్షమని, ప్రతిఒక్కరూ భగవంతుడి సేవలో ఉండాలని ఆధ్యాత్మిక వక్తలు ఎస్.వి.రమణ, కె.రామ్మోహనరావు తెలిపారు. స్థానిక దత్తపీఠంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యంనాయుడు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక జ్ఞాన బోధ సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవంతుని నామాన్ని నిత్యం స్మరిస్తూ ఉంటే పాపాలు తొలగిపోతాయని, దుఖాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టర్, పండిత నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు



వీఏఏలతో మాట్లాడుతున్న ఏవో నవీన్

సంతకవిటి: రానున్న ఖరీఫ్ సాగుకు సంబంధించి, వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో నవీన్ అన్నారు. మండలంలోని మందరాడ గ్రామ రైతు భరోసా కేంద్రంలో వీఏఏలతో గురువారం సమావేశమైన ఆయన.. స్వర్ణ, సోనా, సాంబ వంటి వరి రకాల సాగుతో పాటు నూతన వంగడాల సాగుపై రైతులకు ఆసక్తి పెంచేలా చూడాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువుల కోసం ఇండెంట్ పంపించాలని తెలిపారు.

రేపటి నుంచి గురుకులంలో ప్రవేశాలు

లక్కవరపుకోట: జమ్మాదేవిపేటలోని మహాత్మా జ్యోతిబా బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి అడ్మిషన్లు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌పాత్రో గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షల్లో ఎంపికైన విద్యార్థినుల తల్లిదండ్రులకు ఇప్పటికే సమాచారం అందించామన్నారు. మెరిట్ జాబితా పాఠశాల ప్రధాన గేటు వద్ద అతికించామన్నారు. విద్యార్థినులు ర్యాంక్ కార్డు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ), కులధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెలుపు రేషన్ కార్డు జెరాక్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తో శనివారం ఉదయం 10 గంటలకు పాఠశాలలో హాజరు కావాలని సూచించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



వంగర: కొప్పరవలసలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ జనార్దన్

వంగర: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వై.వి.జనార్దన్ హెచ్చరించారు. మండలంలోని వి.వి.ఆర్.పేట, రాజులగుమ్మడ, కొప్పరవలస గ్రామాల్లో గురువారం పర్యటించిన ఆయన.. ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎన్నికల ఫలితాల వరకు ఎన్నికల నిబంధనలు అమలులో ఉంటాయని, జూన్ 4వ తేదీన వెలువడే ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎవరూ ఎటువంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేసుకోవద్దని, గొడవలు ఆడవద్దని సూచించారు.

బొబ్బిలి: ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పట్టణంలోని గొల్లవీధిలోని ప్రజలతో గురువారం సమావేశమైన ఆయన.. ఎన్నికల ఫలితాలు రోజున, ఫలితాల తర్వాత ఎటువంటి తగాదాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్థానిక పెద్దలపై ఉందన్నారు. ఎవరూ ఎవరిపై ఎటువంటి దూషణలకు పాల్పడవద్దన్నారు. ఆయన వెంట సీఐ ఎం.నాగేశ్వరరావు, ఎస్‌ఐ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో దాడి

బొబ్బిలి: స్థానిక ఫ్లైఓవర్ వద్ద జరుగుతున్న ఎగ్జిబిషన్‌కు గురువారం వచ్చిన అప్పలరాజుపేటకు చెందిన ఓ కుటుంబంపై బొబ్బిలి పట్టణానికి చెందిన కొంతమంది మద్యంమత్తులో దాడికి పాల్పడ్డారు. ఆ కుటుంబంలోని ఓ మహిళను ఉద్దేశించి, అసభ్యకర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నాగేశ్వరరావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొబ్బిలి: మండలంలోని కలువరాయి, జగన్నాథపురం, పెంట సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఈఈ డి.ఫణికిరణ్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. కలువరాయి ఫీడర్ పరిధిలో విద్యుత్‌స్తంభాల మార్పు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అసౌకర్యం కలుగుతోందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాజాం గ్రీనరీకి కృషి

రాజాం: రాజాం గ్రీనరీకి రాజాం పర్యావరణ పరిరక్షణ కమిటీ కృషి చేస్తోందని కమిటీ కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు తెలిపారు. స్థానిక పట్టణంలోని పలు సంఘాలు, వ్యాపారవేత్తలు, వైద్యులను కలిసిన కమిటీ సభ్యులు పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. రాజాం పట్టణంతో పాటు రాజాం పరిసర ప్రాంతాల్లో వెయ్యి మొక్కలు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నామని, తొలి విడతలో రాజాంలో 650 మొక్కలు నాటుతున్నామని, మొక్కలను కడియం నర్సరీ నుంచి తెప్పిస్తున్నామన్నారు.

జూనియర్ కళాశాల మంజూరు

జామి: మండల వాసులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల మండల కేంద్రానికి మంజూరైందని ఎంఈఓ గంగరాజు, జామి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్ రెహమాన్ తెలిపారు. జామి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ జామి హైస్కూల్‌లోనే ప్రత్యేకంగా జూనియర్ కళాశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. మండలంలోని విద్యావేత్తలు,విశ్రాంత ఉద్యోగులు కృషి ఫలించందని అన్నారు.

బుద్ధుని బోధనలు అనుసరణీయం



బుద్ధుని విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న గ్రీన్ బెల్ట్ సొసైటీ సభ్యులు

బొబ్బిలి: బుద్ధుని బోధనలు అనుసరణీయమని వక్తలు కొనియాడారు. బుద్ధపౌర్ణమి పురస్కరించుకుని, మండలంలోని కునుకువానివలస వద్ద ఉన్న గౌతమ బుద్ధుని విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం బుద్ధుని బోధనలు గుర్తు చేసుకున్నారు. గ్రీన్ బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బుద్ధుని విగ్రహం నిర్మించిన చప్ప అప్పలనాయుడును సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు వి.వి.ఎస్.శర్మ, విజయగౌరి, మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులు మరింత సహకరించాలి



మాట్లాడుతున్న విశాఖ కో–ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ రాఘవేంద్రరావు

రాజాం సిటీ: బ్యాంకు అభివృద్ధికి ఖాతాదారులు మరింత సహకరించాలని విశాఖ కో–ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు కోరారు. స్థానిక సూర్యదుర్గ కల్యాణ మండపంలో గురువారం జరిగిన విశాఖ కో–ఆపరేటివ్ బ్యాంకు బ్రాంచి సభ్యులు, బ్యాంకు ఖాతాదారుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. ఒకరికొకరు సహకరించుకుంటేనే జీవనవిధానం మెరుగుపడుతుందని, అటువంటి సహకారం విశాఖ కో–ఆపరేటివ్ బ్యాంకు అందిస్తుందని తెలిపారు. సహకార రంగంలో పేద, మధ్య తరగతి, చిరు వ్యాపారులకు తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు అందిస్తోందన్నారు. బ్యాంకు ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యంగా పని చేస్తున్నామని, బ్యాంకుకు రావాల్సిన బకాయిలను పైసాతో సహా వసూలు చేస్తామన్నారు. అలాగే 14 బ్రాంచిలకు సొంత భవనాలు ఏర్పాటు చేశామని, విశాఖపట్నం, గోపాలపట్నం బ్రాంచిలకు 889 గజాల స్థలాన్ని కొనుగోలు చేశామని, గాజువాక, చోడవరంలలో కూడా స్థలం కొనుగోలు చేయనున్నామన్నారు. అనంతరం బ్యాంకు సీనియర్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్ ఎ.రామకృష్ణారావు, జోనల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ, బ్యాంకు మేనేజర్ జీఎల్‌వీ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానశాస్త్రంపై అవగాహన



విజ్ఞానశాస్త్రంపై అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రమేష్

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విజ్ఞానశాస్త్రంపై తెర్లాం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఎస్.ఎం.రమేష్ గురువారం అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో చాలామందికి విజ్ఞానశాస్త్రం, గణితం సబ్జెక్టులపై భయం ఉంటుందని, ఆయా సబ్జెక్టుల అంత సులభం మరే సబ్జెక్టులు లేవన్నారు. అనంతరం విజ్ఞానశాస్త్రం సబ్జెక్టుకు సంబంధించిన బొమ్మలు ఎలా వేయాలి, వాటి భాగాలు ఏ విధంగా గుర్తించాలో విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సి.హెచ్.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులకు విద్యాసంబంధిత అంశాలు నేర్పించడంతో పాటు ఆటపాటలు కూడా నేర్పిస్తున్నామని లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్ తెలిపారు.

వేతనదారులందరికీ పనులు కల్పించండి



మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ జిల్లా అంబుడ్స్‌మన్ అన్నపూర్ణమ్మ

బాడంగి: ఉపాధి హామీ పథకం వేతనదారులందరికీ పనులు కల్పించాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ జిల్లా అంబుడ్స్‌మన్ శతపతి అన్నపూర్ణమ్మ సూచించారు. మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో గురువారం సమావేశమైన ఆమె.. మండల వ్యాప్తంగా పనులు జరుగుతున్న తీరు, నాణ్యతా ప్రమాణాలు, వేతనాలపై ఆరాతీశారు. జాబ్‌కార్డు ఉన్న వారందరినీ పనులకు అనుమతించాలని, వేసవి ఎండల కారణంగా వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా చూడాలని సూచించారు. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ఏపీవో విజయలక్ష్మి, ఏవో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లల గుర్తింపు సర్వే



అరసాడలో సర్వేను పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు



రామభద్రపురం: ప్రత్యేకావసరాల పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరిస్తున్న ఐఈఆర్‌టీ రాజేశ్వరి

వంగర: మండలంలోని అరసాడ గ్రామంలో ప్రత్యేకావసరాల పిల్లల గుర్తింపు సర్వే గురువారం నిర్వహించారు. సర్వే పరిశీలించిన అనంతరం ఎంఈవో వై.దుర్గారావు మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో ఈ సర్వే చేస్తున్నామని, అరసాడ, శ్రీహరిపురం, మగ్గూరు, సంగాం, శివ్వాం, తలగాం గ్రామాల్లో 10 మంది పిల్లలను గుర్తించామన్నారు. వారందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, నాణ్యమైన విద్య అందివ్వడంతో పాటు, గృహాధారిత విద్య కూడా అందిస్తామన్నారు. 18 ఏళ్లలోపు వయసు ప్రత్యేకావసరాల పిల్లలకు ప్రభుత్వం ఫిజియోథెరపీ, ఉపకరణాలు కూడా అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై.సంగోజి, లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: ప్రత్యేకావసరాల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించాలని ఎంఈవో తిరుమల ప్రసాద్, జిల్లా సహిత విద్య కో–ఆర్డినేటర్ ఎస్.సూర్యారావు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేకావసరాల పిల్లల గుర్తింపు కోసం గురువారం సర్వే చేశారు. పిల్లల తల్లిదండ్రులను కలిసి, భవిత కేంద్రాల ద్వారా పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌పై అవగాహన



వంగర: వృద్ధుడికి బీసీజీ టీకా వేస్తున్న సిబ్బంది

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌పై గురువారం అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, టీబీ వ్యాధిగ్రస్తులు తప్ప మిగతా వారంతా బీసీజీ టీకా వేసుకోవాలని సిబ్బంది తెలిపారు. ప్రతిఒక్కరూ ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం జి.యోగీశ్వరి, ఎమ్‌ఎల్‌హెచ్‌పీ వై.దేవమణి పాల్గొన్నారు.

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం సచివాలయంలో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టి, పెద్దలకు అడల్ట్ బీసీజీ టీకాలు వేశారు. అలాగే టీబీ బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యారోగ్య సిబ్బంది వివరించారు.